జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

10 ఏప్రిల్ 2026 | మెదక్ | పేజీలు :4 వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 130

# ధరల దెబ్బ...!




**చుక్కలనంటుతున్న ‘ఎర్ర’ బంగారం**
**ఇటుక ధరతో పేదవాడికి గుబులు!**
**లెక్కలు మారుతున్నాయి.. అప్పులు పెరుగుతున్నాయి**
**గోడ కట్టకముందే బడ్జెట్ దాటుతోంది**
**ఇటుకల ఖర్చే రూ. 1.75 లక్షలు**

**హైదరాబాద్ ఏప్రిల్ 09:** తులంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ‘ఇందిరమ్మ ఇళ్ల’ నిర్మాణానికి ఇటుకల కొరత పెద్ద అడ్డంకిగా మారింది. ఒకవైపు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం, మరోవైపు అదుపులేకుండా పెరుగుతున్న నిర్మాణ సామాగ్రి ధరల మధ్య లబ్ధిదారులు నలిగిపోతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణానికి అత్యవసరమైన ఎర్ర ఇటుకల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి.

**భారంగా మారిన బడ్జెట్:** పథకం ప్రారంభంలో 2,000 ఇటుకల ధర రూ. 14,000 ఉండగా, ప్రస్తుతం అది రూ. 19,500 నుండి రూ. 20,000 వరకు పలుకుతోంది. ఒక్కో ఇంటికి దాదాపు 18,000 ఇటుకలు అవసరమవుతాయి. కేవలం ఇటుకల కోసమే లబ్ధిదారులు రూ. 1.75 లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం పునాదులు, గోడలకే సరిపోతోందని, స్లాబ్ వేయడానికి అదనంగా అప్పులు చేయక తప్పడం లేదని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొరతకు కారణాలు ఇవే..

**ముడిసరుకు సమస్య:** ఇటుకల తయారీకి

మిగతా 2లో

## 10-అంశాల ప్రణాళికలో ‘అణు’ చిచ్చు




కాల్పుల విరమణకు ఇరాన్ పెట్టిన ప్రధాన షరతు
ఇస్లామాబాద్‌లో ముఖాముఖి
ఉత్కంఠ రేపుతున్న అమెరికా-ఇరాన్ ప్రతినిధుల భేటీ
అయతొల్లా ఖమేనీ స్మరణలో గర్జన
శత్రువులు మాపై విజయం సాధించలేరని ఎస్లామీ హెచ్చరిక
యురేనియం శుద్ధిని అంగీకరించని అగ్రరాజ్యం
ప్రతిష్టంభన దిశగా శాంతి చర్చలు
పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నడుమ శాంతి కోసం ప్రయత్నం

2

## చట్టసభల్లో ‘వందనం’



33 శాతం రిజర్వేషన్లతో సమసమానత్వానికి బాటలు
ఎన్నికల ముంగిట మహిళా రిజర్వేషన్లు అమల్లోకి తేవడం అనివార్యం
వాయిదా వేయడం అంటే అసమానతలను పొడిగించడమే
జాప్యంపై ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు
ఏప్రిల్ 16 – భారత ప్రజాస్వామ్యంలో నవశకం
మూడు రోజుల ప్రత్యేక పార్లమెంట్ సెషన్ ప్రాధాన్యత

2



## మేము కేవలం చట్ట నిపుణులమే

మత విషయాల్లో మా పరిమితులు మాకు తెలుసన్న ధర్మాసనం
తొమ్మిది మంది న్యాయమూర్తులు..
దేశం చూపు చారిత్రక విచారణలో తదుపరి అడుగులు

2

## ఆశ చూపించి అల్లాడిస్తున్నారా?

ఒకేసారి’ నిర్ణయం.. ఒకేచోట ఇబ్బందులు
రేషన్ పంపిణీలో తప్పని తడబాటు
పేరుకే భారీ కోటా.. చేతికొచ్చేసరికి తిప్పలు
నో స్టాక్.. నో రైస్
రేషన్ దుకాణాల ముందు లబ్ధిదారుల వెనుదిరుగుతున్న దృశ్యాలు
గోదాములు నిండవు.. డీలర్ల దగ్గర స్థలం ఉండదు
నిల్వ సామర్థ్యానికీ మించిన భారం
పాత వాహనాలు.. పరిమిత హమాలీలు
17 వేల టన్నుల రవాణా సాధ్యమేనా?



**హైదరాబాద్ ఏప్రిల్ 09:** రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ బియ్యాన్ని ఏకకాలంలో పంపిణీ చేయాలని తీసుకున్న నిర్ణయం అమలులో అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. లబ్ధిదారులకు సౌలభ్యంగా ఉంటుందని భావించిన ఈ ప్రక్రియ, ప్రస్తుతం సరఫరా మరియు నిల్వ సమస్యల కారణంగా గందరగోళానికి దారితీస్తోంది.

**సరిపోని నిల్వ సామర్థ్యం:** చౌకధరల దుకాణాల నిర్వాహకులు సాధారణంగా తమ నెలవారీ కోటాకు అనుగుణంగానే చిన్న గదులను అద్దెకు తీసుకుంటారు. ఇప్పుడు ఒక్కసారిగా మూడు నెలల కోటా సరఫరా చేయాల్సి రావడంతో, ఆ బియ్యాన్ని భద్రపరిచేందుకు దుకాణాల్లో స్థలం సరిపోవడం లేదు. ఫలితంగా, బియ్యం వచ్చిన వెంటనే పంపిణీ చేయడం, నిల్వలు నిండుకోగానే కొత్త కోటా కోసం వేచి చూడటం డీలర్లకు పరిపాటిగా మారింది.

**రవాణా వ్యవస్థపై ఒత్తిడి:** కరీంనగర్ జిల్లా గణాంకాలను పరిశీలిస్తే, 566 దుకాణాలకు గాను 17,000 టన్నుల బియ్యం

మిగతా 2లో

**500 బోరు బావులతో ‘కుంగుబాటు’ గుట్టు విప్పే పని**
**డిసెంబర్ డెడ్‌లైన్ రేవంత్ సర్కార్ రిపేర్ ప్లాన్..**
**నిధుల అడ్డంకి లేదు, జాప్యం అస్సలు వద్దు**
**క్షేత్రస్థాయిలోనే ‘బేస్ క్యాంప్’ మేడిగడ్డ వద్దే మకాం వేసి మరీ మరమ్మత్తులు**
**కేవలం పిల్లర్లు కాదు.. 1.6 కిలోమీటర్ల సమగ్ర స్కాన్**
**బ్యారేజీ భద్రతపై లోతైన అధ్యయనం**
**ఢిల్లీ నిపుణుల నీడలో పనులు సీడబ్ల్యూసీ, ఎన్‌డీఎస్‌ఏ సూచనలే శిరోధార్యం**

# మేడిగడ్డపై యుద్ధం



2

కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని లోపాలను సరిదిద్ది, తిరిగి వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో కీలక ఆదేశాలు జారీ చేశారు.

## ‘ప్రభుత్వ భూమైతే హైడ్రా గడ్డి పీకుతున్నదా?

**పొంగులేటి కాదు.. ‘పొగరులేటి’**
**హరీశ్‌రావు విలక్షణ విమర్శలు**
**రాఘవ సంస్థను కాపాడేందుకే అబద్ధాలా?**
**అసెంబ్లీ సాక్షిగా క్షమాపణ చెప్పాలి**
**ఆ మైనింగ్ నీది కాకపోతే.. ‘రాఘవ’ బోర్డులకు పెయింట్ ఎందుకు వేశారు?**
**నాదర్‌గుల్ భూములపై మాజీ మంత్రి ‘హరీష్’ గర్జన**



నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివే అని మంత్రి అంటున్నప్పుడు, అక్కడ అక్రమ నిర్మాణాలను కూల్చడానికి ‘హైడ్రా’ ఎందుకు వెనకాడుతోందని హరీశ్ నిలదీశారు. పేదల ఇళ్లపైకి వెళ్లే హైడ్రాకు, బౌన్సర్ల పహారాలో ఉన్న ఈ భూములు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే అక్కడ కాంపౌండ్ వాల్స్ తొలగించి, భూమిని స్వాధీనం చేసుకోవాలని సవాల్ విసిరారు.

2

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
శుక్రవారం 10-04-2026

## ధరల దెబ్బ

అవసరమైన నాణ్యమైన మట్టి లభించకపోవడం, ముఖ్యంగా ఖమ్మం వంటి జిల్లాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

కూలీల కొరత: స్థానికంగా పనులు చేసే వారు లేకపోవడం, ఇతర ప్రాంతాల నుండి వచ్చే కూలీలకు అధిక వేతనాలు చెల్లించాల్సి రావడంతో బట్టీల యజమానులు ఉత్పత్తిని తగ్గించేస్తున్నారు.

రవాణా భారం:స్థానికంగా ఇటుకలు దొరకకపోవడంతో పక్క జిల్లాల నుండి లేదా సుదూర ప్రాంతాల నుండి తెచ్చుకోవాల్సి వస్తోంది. డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు కూడా భారమయ్యాయి.

సిమెంటు బ్రిక్స్‌కూ తప్పని డిమాండ్

ఎర్ర ఇటుకల కొరతను అధిగమించడానికి లబ్ధిదారులు సిమెంటు బ్రిక్స్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే, ఇదే అదనుగా భావించిన వ్యాపారులు ఒక్కో బ్రిక్ ధరను రూ. 25 నుండి రూ. 35కి పెంచేశారు. ఇవి కూడా సకాలంలో లభించకపోవడంతో చాలా గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు 'నత్తనడకన' సాగుతున్నాయి.

ప్రభుత్వ సడలింపుతో స్వల్ప ఊరట

నిర్మాణ దశల్లో ఎదురవుతున్న ఇబ్బందులను గమనించిన తెలంగాణ ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కప్పు (స్లాబ్) వేసిన తర్వాత ప్లాస్టరింగ్, వైరింగ్, పెయింటింగ్ వంటి పనులన్నీ పూర్తయితేనే నిధులు విడుదల చేసేవారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఈ నిబంధనలను సడలించారు. తుది దశ పనులు పూర్తికాకపోయినా, నిర్మాణ స్థితిని బట్టి నిధులు విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో లబ్ధిదారులకు కొంత ఊరట లభించింది.

## *ఆశ చూపించి అల్లాడిస్తున్నారా?*

పంపిణీ చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 11,000 టన్నులు (65%) మాత్రమే రవాణా అయ్యింది. ఉన్న వాహనాలు మరియు హమాలీ కార్మికులతోనే మూడు రెట్ల భారాన్ని మోయాల్సి రావడంతో సరఫరా వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. పౌరసరఫరాల శాఖ ప్రాంతాల వారీగా బియ్యం పంపుతున్నప్పటికీ, బియ్యం అయిపోయిన దుకాణాలకు తిరిగి స్టాక్ రావడానికి మూడు నుండి నాలుగు రోజులు పడుతోంది.

**లబ్ధిదారుల ఆవేదన:** బియ్యం కోసం ఆశగా వస్తున్న నిరుపేదలకు రేషన్ దుకాణాల ముందు 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. కూలీ పనులు మానుకుని మరీ వస్తున్నామని, తీరా వచ్చాక బియ్యం లేవని చెబుతుండటంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల కోటా ఒకేసారి ఇస్తున్నారన్న సమాచారంతో జనం పెద్ద ఎత్తున ఎగబడటం కూడా నిల్వలు త్వరగా కాలిపోవడానికి కారణమవుతోంది.

## మేం కేవలం చట్ట నిపుణులమే...


**న్యూఢిల్లీ ఏప్రిల్ 09:** శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై కొనసాగుతున్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి గట్టిగా సమర్థించింది. ఇది మహిళల పట్ల వివక్ష చూపడం కాదని, శతాబ్దాలుగా వస్తున్న మత విశ్వాసాలకు సంబంధించిన అంశమని సుప్రీంకోర్టులో స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఎదుట కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు.

**ఆచారాలు పురుష కేంద్రకృతం కాదు:**
మత విశ్వాసాలు కేవలం పురుషుల కోసం లేదా మహిళల కోసమే రూపొందించబడ్డాయి అనుకోవడం పొరపాటని తుషార్ మెహతా పేర్కొన్నారు. దేశంలో కేవలం మహిళలకు మాత్రమే అనుమతి ఉండి, పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు కూడా ఉన్నాయని ఆయన కోర్టుకు వివరించారు. ఇందుకు ఉదాహరణగా కేరళలోని కొట్టంకులంగర శ్రీ దేవి ఆలయ ఆచారాన్ని ప్రస్తావించారు. అక్కడ 'చమయవిళక్కు' ఉత్సవం సందర్భంగా పురుషులు మహిళల్లా చీరకట్టుకుని, అలంకరించుకుని వెళ్తేనే అనుమతి ఉంటుందని గుర్తుచేశారు.

**రాజ్యాంగ నైతికత వర్తించదు:**
ఈ కేసులో రాజ్యాంగ నైతికత కంటే భక్తుల విశ్వాసాలకే పెద్దపీట వేయాలని అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ వాదించారు. 2018 నాటి సుప్రీంకోర్టు తీర్పు.. పురుషులు ఉన్నతులు, మహిళలు తక్కువ అనే తప్పుడు ఆపోహ ఆధారంగా వచ్చిందని కేంద్రం అభిప్రాయపడింది. ప్రతి ఆలయానికి ఒక ప్రత్యేకమైన ఆచారం ఉంటుందని, దాన్ని గౌరవించాలని కోరింది.

**న్యాయస్థానం స్పందన:**
మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, ఏది కాదో నిర్ణయించే అధికారం న్యాయస్థానానికి ఉంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. "మేము కేవలం చట్టం విషయంలో మాత్రమే నిపుణులం.. మత విషయాల్లో కాదు" అని పేర్కొంటూనే, మత విశ్వాసాల పేరుతో జరిగే అంశాలను సమీక్షించే హక్కు తమకు ఉందని స్పష్టం చేసింది.

## "ప్రభుత్వ భూమైతే హైడ్రా గడ్డి పీకుతున్నదా?



వనపర్తి, ఏప్రిల్ 9 :నాదర్‌గుల్ భూములు ప్రభుత్వానివే అని మంత్రి అంటున్నప్పుడు, అక్కడ అక్రమ నిర్మాణాలను కూల్చడానికి 'హైడ్రా' ఎందుకు వెనకాడుతోందని హరీశ్ నిలదీశారు. పేదల ఇళ్లపైకి వెళ్లే హైడ్రాకు, బౌన్సర్ల పహారాలో ఉన్న ఈ భూములు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తక్షణమే అక్కడ కాంపౌండ్ వాల్స్ తొలగించి, భూమిని స్వాధీనం చేసుకోవాలని సవాల్ విసిరారు.

**భూముల చరిత్ర – బీఆర్ఎస్ వాదన**
ఈ భూములు బీఆర్ఎస్ హయాంలో రిజిస్ట్రేషన్ అయ్యాయన్న మంత్రి వాదనను హరీశ్ కొట్టిపారేశారు.
2016: బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ భూములను 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టింది.
2022: హైకోర్టు సింగిల్ బెంచ్ మరియు డివిజన్ బెంచ్‌లలో ప్రభుత్వం బలమైన వాదనలు వినిపించి, ఇవి సీలింగ్ భూములని నిరూపించిందని గుర్తుచేశారు.

**రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై నిప్పులు**
మంత్రి పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంలో పారదర్శకత లేదని ధ్వజమెత్తారు. అసెంబ్లీలో మైనింగ్ మంత్రి రాఘవ సంస్థకు అనుమతులు లేవని చెప్తున్నప్పుడు పొంగులేటి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ బోర్డులపై పెయింట్ వేయడం, జెండాలు పీకేయడం ఆ సంస్థ మంత్రిదేననడానికి నిదర్శనమని ఆరోపించారు.

**'పొంగులూటీ' విమర్శ:** మంత్రి పేరును 'పొంగులూటీ' అని, ఆయన ప్రసంగాలు 'తుస్సు బాంబులు' అని ఎద్దేవా చేస్తూ, అధికార గర్వంతో నిజాలు దాస్తున్నారని విమర్శించారు. ఈ భూముల్లో గతంలో సాగు చేసుకున్న రైతులకు తిరిగి ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు

## చట్టసభలో 'వందనం'

**అమరావతి / ఢిల్లీ ఏప్రిల్ 09:** దేశ భవిష్యత్తును నిర్దేశించే చట్టసభల్లో నారీశక్తికి సముచిత స్థానం కల్పించే దిశగా మరో అద్భుత ఘట్టానికి సమయం ఆసన్నమైందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ నెల 16 నుంచి జరగనున్న ప్రత్యేక పార్లమెంటు సెషన్ మహిళా రిజర్వేషన్ చట్టం (నారీశక్తి వందన్ అధినియం) అమలులో చారిత్రక మలుపు కానుందని ఆయన తన అధికారిక బ్లాగ్‌లో పేర్కొన్నారు.

**అసమానతలకు చెక్.. సమానత్వానికి కేరాఫ్:**మహిళలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నా, నిర్ణయాధికారాల్లో (రాజకీయాల్లో) వారి ప్రాతినిధ్యం తక్కువగా ఉండటం దురదృష్టకరమని ప్రధాని అభిప్రాయపడ్డారు. "మహిళా వికాసంపై భారత్ నిబద్ధతను చాటేందుకు 2029 ఎన్నికల నుంచే ఈ రిజర్వేషన్లను అమల్లోకి తీసుకురావడం తప్పనిసరి. ఇకపై జాప్యం అంటే అసమానతలను ప్రోత్సహించడమే అవుతుంది" అని ఆయన స్పష్టం చేశారు.

**మూడు రోజుల కీలక సెషన్:**ఏప్రిల్ 16 నుంచి 18 వరకు జరిగే పార్లమెంటు సమావేశాల్లో ఈ చట్టాన్ని త్వరితగతిన అమల్లోకి తెచ్చేందుకు అవసరమైన శాసనపరమైన ప్రక్రియలు పూర్తవుతాయని మోదీ తెలిపారు. ఈ ప్రక్రియకు పార్టీలు, వ్యక్తులకు అతీతంగా అందరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు. 106వ రాజ్యాంగ సవరణ చట్టం – 2023 కేవలం ఒక చట్టం మాత్రమే కాదని, అది కోట్లాది భారతీయ మహిళల ఆకాంక్ష అని ఆయన కొనియాడారు.

**రాజ్యాంగ విలువల రక్షణే లక్ష్యం:** మహాత్మా పూలే 200వ జయంతి (ఏప్రిల్ 11), డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి (ఏప్రిల్ 14) సందర్భాలను గుర్తుచేస్తూ.. రాజ్యాంగం అందించిన సమసమానత్వ స్ఫూర్తికి ఈ నిర్ణయం ఊపిరి పోస్తుందని ప్రధాని రాశారు. దేశ వికాసం కోసం పౌరులందరికీ సరిసమాన భాగస్వామ్యం కల్పించడం మనందరి బాధ్యతని ఆయన గుర్తుచేశారు. బిహు, విషు, సంక్రాంతి వంటి పండుగల వేళ మహిళలకు ఈ రిజర్వేషన్ ఫలాలు అందబోతున్నాయని ప్రధాని వెల్లడి. రాబోయే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా చర్యలు. సైన్స్, టెక్నాలజీ, స్టార్టప్స్, సాయుధ దళాల్లో మహిళల సేవలను అభినందించిన మోదీ.

## మహనీయులే నిజమైన హీరోలు

విశాఖపట్నం ఏప్రిల్ 09: "యువత కేవలం చదువులకే పరిమితం కాకుండా, వ్యవస్థల్లో మార్పు తీసుకువచ్చే బలమైన శక్తిగా ఎదగాలి" అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) శతాబ్ది ఉత్సవాల మెగా కల్చరల్ ఫెస్ట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

**రాజకీయాల్లో నాకైనా మినహాయింపు లేదు:**
ప్రసంగం మధ్యలో పవన్ కల్యాణ్ రాజకీయ జవాబుదారీతనంపై అత్యంత కీలక వ్యాఖ్యలు చేశారు. "చరిత్రను చదివినప్పుడు దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి గురించి తెలిస్తే స్వార్థం అనేదే ఉండదు. భావితరాల భవిష్యత్తు కోసం, నా చెల్లెమ్మల రక్షణ కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఒకవేళ పొలిటికల్ గా పవన్ కల్యాణ్ సరిగ్గా పనిచేయకపోతే.. నన్ను నిర్మొహమాటంగా పక్కన పెట్టేయండి" అని ఆయన వ్యాఖ్యానించడం విశేషం.

**భావజాలం సక్రమంగా ఉండాలి:**
యువత నేరుగా రాజకీయాల్లోకి రాకపోయినా సమాజం పట్ల ఒక స్పష్టమైన మరియు సరైన భావజాలాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. "గతంలో 1970, 80వ దశకాల్లో సాధ్యంకాని భావజాలంతో చాలా మంది యువత అడవుల పాలై ప్రాణాలు కోల్పోయారు. ఆ బాధ నన్ను ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. అలాంటి తప్పులు జరగకూడదు. నేడు దేశం ప్రధాని మోదీ నాయకత్వంలో, రాష్ట్రం సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో అభివృద్ధి దిశగా దూసుకెళ్తోంది. యువత విజ్ఞానం సామాజిక సమస్యల పరిష్కారానికి మార్గం కావాలి" అని కోరారు.

**విద్యార్థులతో ఆత్మీయ సమయం:**విద్యార్థుల మేధస్సును ఎదుర్కోవడం కంటే వారి మనస్సును అర్థం చేసుకోవడమే కష్టమైన పని అని పవన్ అభిప్రాయపడ్డారు. దేశాన్ని వైజ్ఞానికంగా, మేధోపరంగా అభివృద్ధి చేసిన మహనీయులనే నిజమైన హీరోలుగా గుర్తించాలని యువతకు హితవు పలికారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలను తిలకించిన ఆయన, వారితో కలిసి ఫోటోలు దిగి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ రాజశేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## బీజేపీకి దత్తపుత్రుడిలా జగన్

**అమరావతి ఏప్రిల్ 09:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతి రాజధాని విషయంలో జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై స్పందిస్తూ.. ఆయనను ఒక 'జోకర్'గా అభివర్ణించారు. మూడు రాజధానుల పేరుతో రుషికొండను మింగేసి, అక్కడ తన కోసం విలాసవంతమైన ప్యాలెస్‌లు కట్టుకున్నారని ఆమె ఆరోపించారు.

**వైఎస్సార్ ఆశయాలు ఏవి?:**
వైఎస్సార్ వారసుడనని చెప్పుకునే జగన్, ఆయన పేరును కేవలం వాడుకుంటున్నారే తప్ప ఆశయాలను పాటించడం లేదని షర్మిల మండిపడ్డారు. "వైఎస్సార్ భావజాలమే ఉంటే జలయజ్ఞం ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు? ఆయన తీవ్రంగా వ్యతిరేకించిన బీజేపీకి జగన్ దత్తపుత్రుడిగా ఎందుకు మారారు?" అని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎస్సీలు, క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా జగన్ మౌనంగా ఉండటం వెనుక పరమార్థం ఏంటని నిలదీశారు.

**చారిత్రక పాదయాత్ర స్మరణ:**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ చేపట్టిన చారిత్రక పాదయాత్ర నేటికి (ఏప్రిల్ 9) 23 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా షర్మిల నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. "2003 ఏప్రిల్ 9న చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం వరకు సాగిన 1,457 కిలోమీటర్ల ఆ పాదయాత్ర ప్రజాహితమే పరమావధిగా సాగింది. అది కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలోనే కాదు, దేశంలోనూ అధికారంలోకి తెచ్చిన ఒక శాశ్వత జ్ఞాపకం" అని ఆమె అభివర్ణించారు. ఆ స్ఫూర్తి జగన్ పాలనలో ఎక్కడా కనిపించడం లేదని ఆమె విమర్శించారు.

## ఇరాన్ 'అణు' పంతం..

టెహ్రాన్ / ఇస్లామాబాద్: ఏప్రిల్ 09: పశ్చిమాసియాలో భీకర దాడులు, యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ.. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య జరగనున్న 'శాశ్వత కాల్పుల విరమణ' చర్చలు అగ్నిపరీక్షగా మారాయి. ఇరాన్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళికలో 'యురేనియం శుద్ధి' చేసే తమ హక్కును కాపాడుకోవడం అత్యవసరమని ఆ దేశ అణు ఇంధన సంస్థ అధిపతి మొహమ్మద్ ఎస్లామీ స్పష్టం చేశారు.

**ఇస్లామాబాద్ చర్చలపై నీలినీడలు:**
ఈ వారాంతంలో పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో ఇరు దేశాల ప్రతినిధులు ముఖాముఖి భేటీ కానున్న నేపథ్యంలో ఎస్లామీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇరాన్ ప్రతిపాదించిన 10-అంశాల ప్రణాళికలో యురేనియం శుద్ధి అనేది అత్యంత కీలకమైన భాగమని, అయితే దీనిని అంగీకరించడానికి అమెరికా ససేమిరా అంటోందని ఆయన వెల్లడించారు.

**అయతొల్లా స్మరణలో ఆత్మాభిమానం:**
టెహ్రాన్‌లో జరిగిన దివంగత సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంస్మరణ సభలో ఎస్లామీ మాట్లాడుతూ.. ఇరాన్ తన సార్వభౌమత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోదని తెలిపారు. "మా అణు హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. ఇరాన్‌పై శత్రువులు ఎన్నటికీ విజయం సాధించలేరు" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ప్రపంచ దేశాల చూపు:**ఒకవైపు ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలు, మరోవైపు అమెరికా మధ్యవర్తిత్వం వహిస్తున్న ఈ చర్చలు విఫలమైతే పశ్చిమాసియాలో పరిస్థితి మరింత దారుణంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరాన్ తన పంతాన్ని వీడకపోయినా, అమెరికా తన ఆంక్షలను సడలించకపోయినా ఈ శాంతి చర్చలు కేవలం లాంఛనప్రాయంగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

## మేడిగడ్డ గడ్డపై యుద్ధం

**హైదరాబాద్: ఏప్రిల్ 09:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని లోపాలను సరిదిద్ది, తిరిగి వినియోగంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో కీలక ఆదేశాలు జారీ చేశారు.

**యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ**
నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు మూడు బ్యారేజీలకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ నిర్వహిస్తున్న పరీక్షలు, నమూనాల సేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, నిర్మాణ సంస్థలు మరియు డిజైన్ కన్సల్టెంట్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

**మేడిగడ్డపై ప్రత్యేక దృష్టి**
కేవలం కుంగిపోయిన పిల్లర్లకే పరిమితం కాకుండా, మేడిగడ్డలోని మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని సమగ్రంగా అధ్యయనం చేయాలని సిఎం ఆదేశించారు. భూగర్భ పరిస్థితిని అంచనా వేసేందుకు మేడిగడ్డ వద్ద 500 బోరు బావులను తవ్వేందుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేయాలని చెప్పారు. పనులను నిరంతరం పర్యవేక్షించేందుకు మేడిగడ్డ వద్దే ప్రత్యేక బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు.

**డిసెంబర్ నాటికి స్పష్టమైన షెడ్యూల్**
డిసెంబర్ వరకు చేపట్టాల్సిన పనులకు సంబంధించి పూర్తి స్థాయి షెడ్యూల్ సిద్ధం చేయాలని, మరమ్మత్తుల ఏజెన్సీలను అప్రమత్తం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. "పనులకు నిధుల ఇబ్బంది రానివ్వం, కానీ నాణ్యతలో రాజీ పడకూడదు" అని ఆయన స్పష్టం చేశారు. పనులు ప్రారంభమైన తర్వాత తానే స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ముఖ్యమంత్రి పేర్కొనడం ప్రాజెక్టు పట్ల ఆయనకున్న చిత్తశుద్ధిని చాటుతోంది.

**సమన్వయంతోనే సాధ్యం**
ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ ప్రతినిధులు భాగస్వాములయ్యేలా చూడాలని, నీటిపారుదల శాఖ అధికారులతో కూడిన ప్రత్యేక టీమ్ నిరంతరం పర్యవేక్షణ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సేవే లక్ష్యం... 20 ఏళ్లుగా చలివేంద్రంతో ప్రజలకు చల్లని నీడ

### బండారి రమేష్ సేవా స్ఫూర్తి --
### ఎండాకాలంలో ప్రజలకు ఊరట
### పోలీస్ స్టేషన్ ముందు
### ఘనంగా చలివేంద్రం ప్రారంభం

**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్‌నగర్,ఏప్రిల్,9,మెదక్ టుడే న్యూస్:**వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో కళాబంధు బండారి రమేష్ నిర్వహిస్తున్న చలివేంద్రం మరియు అంబలి కేంద్రం ఈరోజు ఘనంగా ప్రారంభమైంది. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని చైర్మన్ అగ్గనూరు బస్వం, స్థానిక కౌన్సిలర్లు పెంటయ్య, ముబారక్ ఆలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యక్రమ స్థలంలో పెద్ద ఎత్తున ప్రజలు చేరుకుని, ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. వేసవిలో తీవ్ర ఎండల కారణంగా ఇబ్బందులు పడుతున్న పేదలు, దినసరి కూలీలు, రోడ్డు ప్రయాణికులు, ఆటో డ్రైవర్లు వంటి వారికి ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా మారనుంది. చల్లని తాగునీరు, అంబలి అందుబాటులో ఉండడం వల్ల ప్రజలకు విశేష ఉపశమనం కలుగుతోంది. గత 20 సంవత్సరాలుగా నిరంతరంగా ఎటువంటి విరామం లేకుండా చలివేంద్రాలను నిర్వహిస్తూ వస్తున్న బండారి రమేష్ సేవా స్ఫూర్తి స్థానిక ప్రజల్లో విశేష గౌరవాన్ని సంపాదించుకుంది. ఎండాకాలం వచ్చిన ప్రతిసారి ప్రజల అవసరాన్ని గుర్తించి, ముందుండి సేవ చేయడం ఆయన ప్రత్యేకతగా నిలుస్తోంది. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రముఖులు, "సమాజానికి తిరిగి ఇవ్వాలనే సంకల్పంతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం నిజంగా అభినందనీయ విషయం. యువత కూడా ఇటువంటి సేవా కార్యక్రమాల పట్ల ఆకర్షితులై ముందుకు రావాలి" అని పేర్కొన్నారు. సమాజంలో సేవా భావం పెంపొందించేందుకు రమేష్ వంటి వ్యక్తులు ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో గుర్రం రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పరందాములు, విద్యాసాగర్ రెడ్డి, శేఖర్, లయన్ కమ్మదనం సుధాకర్, నాగిళ్ళ గోపాల్ గుప్తా, డిస్కో సీను, మురళి, లింగమయ్య, పానుగంటి శశిధర్, రఘురామ చారి, గడ్డం వెంకటేష్, యంసాని శ్రీనివాస్, దుగ్గు శేఖర్, భద్రప్ప, గడ్డం కిషోర్, డా.రాచయ్య, సత్యనారాయణ సింగ్, మనోహర్ రాజ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# నూతన కాలనీలకు మంచి నీరు అందించండి

### జలమండలి ఎండి అశోక్ రెడ్డిని

### కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్

**పటాన్ చెరు ఏప్రిల్ 09(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** పటాన్చెరు నియోజకవర్గంలోని జలమండలి పరిధిలోగల నూతన కాలనీలకు సైతం రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు కేటాయించాలని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్ లోని జలమండలి కార్యాలయంలో ఎండి అశోక్ రెడ్డి ని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట గ్రామం, రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్ 2, సృజన లక్ష్మీ కాలనీ ఫేజ్ 4, టైలర్స్ కాలనీ, లింగమయ్య కాలనీ, కె ఎస్ ఆర్ కాలనీలలో మంచినీటి సరఫరా లేకపోవడంతో ప్రజల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత వేసవి కాలంలో ప్రతి రోజు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు. పైన పేర్కొన్న కాలనీలలో నూతన పైపులైన్ల ఏర్పాటు కోసం



ఇప్పటికే ప్రతిపాదనలు తయారు చేయడం జరిగిందని.. రెండు కోట్ల నిధులు మంజూరు చేస్తే నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి.. అతి త్వరలో నిధుల మంజూరుకు ఆదేశాలు జారీ చేస్తామని తెలిపినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ పేర్కొన్నారు.

# పత్రికలు ప్రజా గొంతుకగా నిలవాలి

### అమీన్పూర్ మున్సిపల్ మాజీ

### వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్

### వార్త దినపత్రిక 30వ వార్షికోత్సవంలో..

**పటాన్ చెరు ఏప్రిల్ 09(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి** ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంగా నిలుస్తున్న పత్రికలు ప్రజా గొంతుకగా నిలవాలని అమీన్పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ అన్నారు. వార్త దినపత్రిక 30వ వార్షికోత్సవ పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్త దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయడంలో పత్రికల పాత్ర గణనీయమైనది అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులోనూ జర్నలిస్టులు, పత్రికలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. గత 30 సంవత్సరాలుగా వార్త దినపత్రిక ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్త పత్రిక యాజమాన్యం, విలేకరులు పాల్గొన్నారు.






# కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ లోకి ఆహ్వానించిన కేటీఆర్

### తెలంగాణలో ప్రజలు సంతోషంగా జీవించాలంటే

### కేసీఆర్ మళ్ళీ సీఎంగా రావాలి

### కాంగ్రెస్ కార్యకర్తలే బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి

### రావాలని కోరుకుంటున్నారు..

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్

**జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 09 :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డిని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లోకి ఆహ్వానించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి జీవన్ రెడ్డిని కలుసుకుని, పార్టీ అధినేత కేసీఆర్ తరఫున అధికారికంగా ఆహ్వానించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. జీవన్ రెడ్డి ఆహ్వానానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. "కేసీఆర్ గారితో నాకు వ్యక్తిగత అనుబంధం ఉంది. మీరు అందరూ వచ్చి ఆహ్వానించడం సంతోషంగా ఉంది. త్వరలో కేసీఆర్ గారిని కలసి, రెండు మూడు రోజుల్లో నా నిర్ణయం ప్రకటిస్తాను" అని జీవన్ రెడ్డి తెలిపినట్లు కేటీఆర్ వెల్లడించారు.

రాష్ట్రంలో రైతులు, పేదలు మళ్లీ సంతోషంగా జీవించాలంటే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా రావాల్సిందేనని అన్నారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అనుభవజ్ఞులైన నాయకుల అవసరం ఉందని, అందుకే జీవన్ రెడ్డి సహకారం కోరుతున్నామని తెలిపారు. జీవన్ రెడ్డి నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీలో సేవలందించిన నిబద్ధత కలిగిన నాయకుడని కేటీఆర్ పేర్కొన్నారు. 2014లో కూడా కేసీఆర్ వారిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన విషయం గుర్తుచేశారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీపై ఉన్న నిబద్ధతతో వారు కొనసాగారని చెప్పారు. కేసీఆర్ మరియు జీవన్ రెడ్డి గారి మధ్య నాలుగు దశాబ్దాలకు పైగా ఉన్న వ్యక్తిగత అనుబంధం, పరస్పర గౌరవం రాజకీయాలకు అతీతమని కేటీఆర్ వివరించారు. కరీంనగర్ జిల్లాలో అభివృద్ధి పనులకు జీవన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వెంటనే ఆమోదం ఇచ్చిన సంఘటనను గుర్తుచేశారు. అసెంబ్లీలో జీవన్ రెడ్డి రైతుల సమస్యలపై గట్టిగా పోరాడిన నాయకుడని, నిజాం షుగర్స్ అంశంపై ఆయన చేసిన పోరాటాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కో-ఆపరేటివ్ విధానంలో షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు మహారాష్ట్ర విధానాన్ని అధ్యయనం చేసి అవసరమైతే దానికి చైర్మన్ గా మీరే ఉండాలని ఆనాడు అసెంబ్లీలో కేసీఆర్ ఇచ్చిన ఆఫర్‌ను కూడా గుర్తుచేశారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించేందుకు ఎలాంటి సంకోచం లేకుండా పార్టీ ప్రయోజనాలే ముఖ్యం, తెలంగాణలో తిరిగి కేసీఆర్ ప్రభుత్వం రావాలన్న ఏకైక లక్ష్యంతో ముందుకు వచ్చిన జగిత్యాల జిల్లా నాయకత్వానికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. జీవన్ రెడ్డి చేరిక కచ్చితంగా మన పార్టీకి అద్భుతమైన బలాన్ని చేకూరుస్తుందని చెప్పిన స్థానిక నాయకులు, జీవన్ రెడ్డి ఆహ్వానించేందుకు వారు చేసిన కృషిని అభినందించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం పూర్తిగా వైఫల్య పాలనను కొనసాగిస్తోందని, ప్రజల దృష్టి మళ్లించేందుకు మాత్రమే డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతుబంధు పథకాన్ని మూడుసార్లు అమలు చేయకుండా రైతులకు 27 వేల కోట్ల రూపాయల బకాయిలు పెడుతూ, మరోవైపు రుణమాఫీ పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రైతుల్లో తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొన్నారు.కండలు తిరిగిన వీరుడైన మూడు నెలల్లో పిల్లలను పుట్టించలేదు అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలు తీవ్ర అభ్యంతరకరం అన్నారు. ముఖ్యమంత్రి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళల పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తోందని, ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు మహిళల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని కేటీఆర్ అన్నారు. ఇది తెలంగాణ సంస్కృతికి విరుద్ధమని విమర్శించారు. యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి, ఒక్క హామీ కూడా అమలు చేయకుండా యువతను మోసం చేశారని ఆరోపించారు. నిరుద్యోగ యువతలో నిరాశ, ఆగ్రహం పెరుగుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఏ ఒక్కటి పూర్తిస్థాయిలో అమలు కాలేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా మోసం చేశారని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితి తెలుసుకొని హామీలు ఇచ్చామని చెప్పి ఇప్పుడు వెనక్కి తగ్గడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ లోపలే అసంతృప్తి పెరుగుతోందని, కార్యకర్తలే బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకత్వం తమ సీనియర్ నేతలను అవమానిస్తూ, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని విమర్శించారు.రేవంత్ రెడ్డి అధికారం మత్తులో అహంకారంగా వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. అధికారం పదవులు శాశ్వతం కాదన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ మళ్లీ ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఏసీబీ కి చిక్కిన అటవీ శాఖ అధికారులు..

**బోథ్, ఏప్రిల్ 09 :** బోథ్ అటవీ శాఖ కార్యాలయంలో గురువారం ఏసీబీ అధికారులు దాడుల నిర్వహించారు. ఏసీబీ డీఎస్పీ మధు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఉపాధి హామీ కింద మొక్కలకు



నీరు పోసినందుకు వ్యక్తికి రూ.5.9 లక్షల బిల్లు మంజూరైందని, బిల్లు విడుదల కోసం అటవీ శాఖ రేంజ్ అధికారి ప్రణయ్, జూనియర్ అసిస్టెంట్ పరశురాం సదరు వ్యక్తిని రూ.40 వేలు డిమాండ్ చేశారన్నారు. కాగా బాధితుడు రూ.15 వేలు ఇస్తానని ఒప్పుకున్నాడని ఈ మేరకు గురువారం డబ్బులు తీసుకుంటుండగా వారిని రెడ్ హ్యాండెడ్ గా ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ మధు తెలిపారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్



**జన్నారం, ఏప్రిల్ 09 :** మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పై పొన్కల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఖానాపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ గురువారం ప్రారంభించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మావోయిస్టు నేత తిప్పిరి తిరుపతిని కలిసిన జువ్వాడి నర్సింగ్ రావు



**కోరుట్ల, ఏప్రిల్ 09 :** మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జి ని కోరుట్ల పట్టణంలో గల ఆయన స్వగృహంలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగ్ రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జువ్వాడి నర్సింగ్ రావుతో పాటు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, వైస్ చైర్మన్ షాహిద్ ఉల్ అహ్మద్, పలువురు కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
శుక్రవారం 10-04-2026



# రొమాంచికం టైటిల్ ఫిక్స్

టాలీవుడ్ లీడింగ్ డైరెక్టర్లలో టాప్‌లో ఉంటాడు సందీప్ రెడ్డి వంగా. ఈ స్టార్ డైరెక్టర్ మరో వైపు నిర్మాత అని కూడా ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. సందీప్ రెడ్డి వంగా నిర్మించే సినిమాలకు హోం బ్యానర్ భద్రకాళి పిక్చర్స్ నేతృత్వం వహిస్తుంది. సందీప్ రెడ్డి వంగా తన ప్రొడక్షన్ వెంచర్స్‌ను కొత్త సినిమాతో మరింత విస్తరింప జేసే ప్లాన్‌లో బిజీగా ఉన్నాడు. సందీప్ రెడ్డి సపోర్ట్‌తో డెబ్యూ దర్శకుడిని పరిచయం చేస్తూ కొత్త సినిమా రాబోతుంది. ఈ చిత్రానికి రొమాంచికం అనే టైటిల్‌ను కూడా ఫైనల్ చేశారు. డెబ్యూ డైరెక్టర్ వేణు ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నాడు. ఇంతకీ ఈ సినిమాలో హీరో ఎవరో తెలుసా..? సుమంత్ ప్రభాస్. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ కూడా మొదలైనట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. సందీప్ రెడ్డి వంగా వెంచర్‌లో సినిమా వస్తుండటంతో అంచనాలు కూడా భారీగానే నెలకొన్నాయి. బలమైన కథ, కథనంతో ప్రేక్షకులను కుర్చీలకు కట్టిపడేసే టాలెంట్ సందీప్ రెడ్డి వంగా సొంతమనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి డైరెక్టర్ సహకారంతో యువ హీరోతో కొత్త దర్శకుడిని పరిచయం చేస్తూ రాబోయే ఈ సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోతున్నాయి. మరి సందీప్ రెడ్డి వంగా టీం ఎలాంటి స్టోరీని తెరపైకి తీసుకురాబోతుందనేది ఆసక్తికరంగా మారింది.

# పెళ్లికి ముహూర్తం ఖరారు..



టాలీవుడ్‌లో యాక్షన్ హీరోగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బెల్లంకొండ సాయి శ్రీనివాస్ త్వరలోనే బ్యాచిలర్ లైఫ్‌కు గుడ్‌బై చెప్పబోతున్నాడు. ప్రముఖ వ్యాపారవేత్త కుమార్తె కావ్య రెడ్డితో ఆయన వివాహం నిశ్చయమైంది. రీసెంట్‌గా ఇరు కుటుంబ సభ్యుల సమక్షంలో ఈ జంటకు సంబంధించిన 'లగ్నపత్రిక' వేడుక ఘనంగా జరిగింది. అత్యంత సన్నిహితులు, బంధువుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం చాలా సాదాసీదాగా, కానీ ఆనందోత్సాహాల మధ్య పూర్తయ్యింది. ఈ వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలను సాయి శ్రీనివాస్ సోషల్ మీడియాలో పంచుకోవడంతో అవి వెంటనే వైరల్ అయ్యాయి. ఫోటోలలో సాయి శ్రీనివాస్ హ్యాపీగా, క్యూట్ లుక్స్‌తో కనిపించగా, కావ్య రెడ్డి కూడా సంప్రదాయ వేషధారణలో ఆకట్టుకుంది. ఈ జంట చూడముచ్చటగా ఉందంటూ నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ లగ్నపత్రిక వేడుకలోనే పెళ్లి ముహూర్తాన్ని ఏప్రిల్ 29గా ఖరారు చేసినట్లు సమాచారం. ఈ పెళ్లి వేడుకను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమవుతున్నారు. టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు కూడా ఈ వివాహానికి హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. సినిమాల విషయానికి వస్తే, సాయి శ్రీనివాస్ 'అల్లుడు శ్రీను' చిత్రంతో ఇండస్ట్రీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చి, తన స్టైల్, యాక్షన్ సన్నివేశాలతో మాస్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. ఆయన సినిమాలు హిందీ డబ్బింగ్‌లో కూడా మంచి వ్యూస్ సాధించి ప్రత్యేక గుర్తింపు పొందాయి. గత ఏడాది ఆయన చేసిన సినిమాలు మంచి స్పందన తెచ్చుకోగా, ప్రస్తుతం కూడా వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా హైందవ అనే అడ్వెంచర్ థ్రిల్లర్‌పై మంచి అంచనాలు ఉన్నాయి.

# వదినపై పరువు నష్టం దావా

సినీ నటి హన్సిక కుటుంబంలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగంగా కోర్టు మెట్లెక్కాయి. తనపైనా, తన కుటుంబంపైనా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ హన్సిక తన వదిన నాన్సీ జేమ్స్‌పై రూ.2 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ భార్య నాన్సీ జేమ్స్ గతంలో సోషల్ మీడియా వేదికగా తన అత్తగారి కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేశారు. గృహహింస, మానసిక వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె పలుమార్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలు ఒక్కసారిగా సంచలనం సృష్టించాయి. అయితే ఈ ఆరోపణలను హన్సిక తీవ్రంగా ఖండించారు. కేవలం డబ్బు వసూలు చేయాలనే ఉద్దేశంతోనే నాన్సీ ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కోర్టులో తెలిపారు. తమ స్టార్ ఇమేజ్‌ను ఉపయోగించుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్నాళ్లు ఈ వివాదంపై మౌనంగా ఉన్నానని, కానీ పరిస్థితులు హద్దులు దాటడంతో న్యాయపోరాటానికి దిగాల్సి వచ్చిందని హన్సిక పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నాన్సీ చేసిన వీడియోలు, కామెంట్లు తన తల్లి గౌరవాన్ని దెబ్బతీశాయని, కుటుంబం మానసికంగా ఇబ్బందులు పడుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు నాన్సీ జేమ్స్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. హన్సిక కుటుంబంపై అవమానకర వ్యాఖ్యలు చేయవద్దని, ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వివాదాస్పద వీడియోలను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కేసు ప్రాధాన్యతను మరింత పెంచాయి. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వాని కూడా ఈ వివాదంలో తన సోదరికి అండగా నిలిచారు. తన భార్య చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఆయన పేర్కొన్నారు. వివాహం తర్వాత కొద్దికాలానికే తమ మధ్య విభేదాలు మొదలయ్యాయని, ఇప్పుడు అవి కుటుంబ స్థాయికి చేరుకున్నాయని తెలుస్తోంది. హన్సిక తరపు న్యాయవాదులు ఈ వ్యవహారాన్ని వ్యాపార ప్రయోజనాలు లేదా వ్యక్తిగత కక్షల కోణంలో చూస్తున్నారు. నాన్సీ కావాలనే వివాదాన్ని పెద్దదిగా చేస్తున్నారని వాదిస్తున్నారు. ఇక కోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఈ వ్యవహారం మరింత మలుపులు తిరిగే అవకాశముంది. హన్సిక కోరిన రూ.2 కోట్ల పరిహారం, అలాగే భవిష్యత్తులో నాన్సీ చేసే వ్యాఖ్యలపై కోర్టు నిర్ణయం కీలకంగా మారనుంది.



# డెకాయిట్ వాయిదా పడుతుందా?

తెలంగాణలో థియేటర్ రంగంలో మరోసారి వివాదం చెలరేగింది. ఎగ్జిబిటర్స్ (థియేటర్ యజమానులు) మరియు నిర్మాతల మధ్య పర్సంటేజ్ విధానం అమలుపై భిన్నాభిప్రాయాలు బయటపడటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పర్సంటేజ్ విధానం ప్రకారం, సినిమా టికెట్ కలెక్షన్లలో ఒక నిర్దిష్ట శాతం నిర్మాతలు , థియేటర్ యజమానుల మధ్య పంచుకోవడం జరుగుతుంది. ప్రస్తుతం అమలులో ఉన్న రెంటల్ లేదా ఫిక్స్‌డ్ మోడల్ కంటే ఇది భిన్నంగా ఉంటుంది. ఎగ్జిబిటర్స్ అభిప్రాయం ప్రకారం, ఈ విధానం అమలు చేస్తే తమ ఆదాయం స్థిరంగా ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే యాక్టివ్ ప్రొడ్యూసర్స్ గిల్డ్ మాత్రం ఈ విధానానికి వ్యతిరేకంగా నిలుస్తోంది. నిర్మాతల వాదన ప్రకారం, పర్సంటేజ్ విధానం వల్ల తమకు వచ్చే లాభాలు తగ్గే ప్రమాదం ఉందని అంటున్నారు. ముఖ్యంగా భారీ బడ్జెట్ సినిమాల విషయంలో ఈ విధానం అనుకూలంగా ఉండదని వారు భావిస్తున్నారు. ఈ విభేదాలు ఇంకా పరిష్కారం కాకపోవడంతో పరిశ్రమలో అనిశ్చితి నెలకొంది. త్వరలో విడుదలకు సిద్ధంగా ఉన్న 'డెకాయిట్', 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' వంటి సినిమాలపై ఈ వివాదం ప్రభావం చూపే అవకాశముంది. పరిస్థితులు చక్కబడకపోతే రిలీజ్ తేదీలు మారే అవకాశం ఉండటంతో పాటు కొన్ని సినిమాలు వాయిదా పడే పరిస్థితి కూడా కనిపిస్తోంది.



# బఅక్కినేని ఫ్యామిలీ చిత్రానికి బెస్ట్ విషెస్

టాలీవుడ్‌లో బైలింగ్వల్ ప్రాజెక్ట్‌గా తెరకెక్కిన డెకాయిట్ సినిమా రేపు ప్రేక్షకుల ముందుకు రానుంది. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ హీరోహీరోయిన్లుగా నటించిన ఈ చిత్రాన్ని కొత్త దర్శకుడు షానియల్ డియో రూపొందిస్తున్నారు. ఏప్రిల్ 10న తెలుగు, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్లు, ట్రైలర్లు, ప్రమోషనల్ కంటెంట్ ఈ సినిమాపై మంచి అంచనాలను పెంచాయి. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో 'డెకాయిట్' గురించే చర్చ నడుస్తోంది. చిత్ర బృందం కూడా దూకుడుగా ప్రమోషన్స్ నిర్వహిస్తూ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. ఈ నేపథ్యంలో స్టార్ హీరోయిన్ సమంత ఈ సినిమాకు తన బెస్ట్ విషెస్ తెలియజేయడం విశేషంగా మారింది. సోషల్ మీడియా వేదికగా ఆమె నిర్మాత సుప్రియ యార్లగడ్డను ఉద్దేశిస్తూ భావోద్వేగపూర్వకంగా పోస్ట్ పెట్టింది. సుప్రియ... నీ కృషి, పట్టుదల, సినిమాపై నీ అంకితభావాన్ని నేను దగ్గరగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయం కోసం నువ్వు అర్హురాలు. దేవుడి ఆశీస్సులు ఎప్పుడూ నీకు ఉండాలి. 'డెకాయిట్' టీమ్‌కు, అడివి శేష్, మృణాల్ ఠాకూర్‌లకు నా అభినందనలు" అంటూ సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పేర్కొంది. ఈ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ముఖ్యంగా అక్కినేని కుటుంబానికి చెందిన ప్రాజెక్ట్‌కు సమంత శుభాకాంక్షలు తెలపడం నెటిజన్లలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో నాగచైతన్యతో వివాహ బంధంలో ఉన్న సమంత, తర్వాత విడిపోయిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ప్రొఫెషనల్‌గా ఇలా స్పందించడం ప్రశంసలు అందుకుంటోంది. ఇక సినిమా విషయానికొస్తే, 'డెకాయిట్' ఒక రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, సునీల్, అతుల్ కులకర్ణి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పిస్తుండగా, యస్.యస్ క్రియేషన్స్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించగా, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్‌ను గ్యానీ కంపోజ్ చేస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలో అడివి శేష్ కూడా భాగస్వామ్యం కావడం విశేషం.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..